ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

జ్యోతినగర్, డిసెంబర్ 19: మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో అంతర్గాం మండల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలని, సాగునీరు, తాగునీరు, విద్యుత్ లైట్లు, రోడ్ల సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. రైతులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. బండల వాగులో నీరు నింపి రైతులకు నీళ్లు ఇవ్వడంపై అధికారులతో చర్చించారు. మహిళా ఉపాధిపై చర్చించారు. ఇక్కడ తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీపీ దుర్గం విజయ, పొట్యాల, మూర్మూర్ ఎంపీటీసీలు ఉన్నారు.

నీటి సరఫరా పైపులైన్ పనులు ప్రారంభం

ఎన్టీపీసీ పట్టణ పరిధిలోని రెండో డివిజన్ పీకే రామయ్యకాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2 కోట్లతో నీటి సరఫరా పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ నగరపాలక మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీపీసీ జ్యోతినగర్ ప్రెస్ భవన్ నిర్మాణానికి రూ. 2 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. టీటీఎస్‌లోని ఇఎస్ఐ డిస్పెన్సరీని సందర్శించగా ఎమ్మెల్యేను డిస్పెన్సరీ స్టాఫ్ సన్మానించింది. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, ఎస్ఈ చిన్నారావు, డీఈఈ జమీల్, కార్పొరేటర్లు రమణారెడ్డి, మహంకాళి స్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాశ్, కొలిపాక సుజాత, ముస్తఫా, నాయకులు ఆసిఫ్‌పాషా, మడిపల్లి మల్లేశ్, కత్తెరమల్ల రమేశ్, భరత్‌గౌడ్, వెంగళ బాపు, ఎన్టీపీసీ, జేఏసీ నాయకులు ఉన్నారు.

ప్రతి కార్మికుడు గర్వపడేలా పనిచేస్తా

ఎన్టీపీసీలోని ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడు, కార్మిక కుటుంబం గర్వపడేలా సమస్యలను పరిష్కరించను న్నట్లు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 20 నుంచి 30 ఎండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి పోలీస్ వెరిఫికేషన్‌ను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ఇండస్ట్రీ మూత పడుతుందని అధికారులను హెచ్చరించారు. ఎన్టీపీసీలో మన కొలువులు మనకే దక్కాలని తెలిపారు. కార్మికుల కోసం ఈఎస్ఐ దవాఖాన, ఇండ్లు కట్టిస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 19 : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌ను ల గోదావరిఖని క్యాంప్ కార్యాలయంలో ఆర్జీ-2 ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి, కార్మిక సంక్షేమంపై జీఎం ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఇక్కడ సర్వే అధికారి చంద్రమౌళి, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ పడాల యాదగిరి ఉన్నారు.

రెస్క్యూ పోటీల విజేతలకు అభినందన

క్రీడాకారులను అభినందిస్తున్న జీఎంలు

రామగిరి, డిసెంబర్ 19: రెస్క్యూ పోటీల విజేతలను సింగరేణి అధికారులు అభినందించారు. సింగరేణి ఆర్జీ-2 ఏరియా మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో ఈనెల 10 నుంచి 15 వరకు నిర్వహించిన 52వ జాతీయ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి బీ టీం ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచింది. ఈ జట్టులో ప్రతిభ చూపిన ఆర్జీ-3,ఏపీఏ సభ్యులతోపాటు ఇతర బృందం సభ్యులను ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు మంగళవారం అభినందించారు. సింగరేణి సంస్థలో రెస్క్యూ సిబ్బందికి మంచి గుర్తింపు ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు, సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణ, పీఈ రఘురాం, ఫారెస్ట్ డీజీఎం కర్ణ, ఎస్‌వోఎం జనార్దన్ ఉన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిలో భాస్కర్ రెడ్డి, నవాబ్, మురళి, అనిల్ కుమార్, శ్రీకాంత్, రాకేశ్, పవన్, శ్యామ్ ఉన్నారు.

ఎన్నికలపై ఏఐటీయూసీ అసత్య ప్రచారాలు

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 19 : సింగరేణి గుర్తింపు ఎన్నికలపై ఏఐటీయూసీ అసత్య ప్రచారాలు చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నదని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఎన్నికలు ఈ నెల 27న నిర్వహించాలని నవంబర్ 11న హైకోర్టు స్పష్టమైన ప్రకటన చేసిందని గుర్తు చేశారు. ఈ మేరకే డిప్యూటీ లేబర్ కమిషనర్ 13 సంఘాలతో మాట్లాడి తేదీ నిర్ణయించడంతో నామినేషన్ల స్వీకరణ, గుర్తుల కేటాయింపు చేశారని తెలిపారు. వీటన్నింటిని మరిచి ఐఎన్‌టీయూసీ ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నదని విమర్శించడం అవివేకమన్నారు. ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యాన్ని కోరారు. సమావేశంలో నాయకులు అక్బర్ అలీ, కొత్త సత్యనారాయణ రెడ్డి, నర్సింహారెడ్డి, ధర్మపురి, అక్రమ్, లక్ష్మీపతిగౌడ్, నాచగోని దశరథంగౌడ్, అయిరెడ్డి సంపత్ రెడ్డి, మార్కండేయ, దాసు, పోచం, గడ్డం తిరుపతియాదవ్, అబ్బిడి రాజిరెడ్డి, రవీందర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సింగరేణిలో ఎన్నికలపై ఏఐటీయూసీ పోరాటం

గోదావరిఖని, డిసెంబర్ 19: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుపాలని ఏడాదిగా ఏఐటీయూసీ పోరాటం చేస్తే యాజమాన్యం, ప్రభుత్వం జాప్యం చేస్తున్నందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం ఆరోపించారు. మంగళవారం జీడీకే-2,11వ గనుల్లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ప్రశ్నించే గొంతుక ఏఐటీయూసీలో భారీ సంఖ్యలో చేరుతున్న యువతరానికి స్వాగతం పలుకుతున్నామన్నారు. సమావేశంలో రంగు శ్రీనివాస్, సతీశ్‌బాబు, సంపత్, కన్నం లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, నరేశ్, రాజు, భాస్కర్, ప్రకాశ్, గౌస్, శనిగల శ్రీనివాస్, శేఖర్, జగదీశ్, రమేశ్ ఉన్నారు.

సీఐటీయూని గెలిపించండి

గోదావరిఖని, డిసెంబర్ 19: ఈనెల 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్జీ-1 ఓసీపీ-5లో మంగళవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గౌస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, నరహరిరావు, ఎస్కే గౌస్, రఘువరణ్, రాజమౌళి, భిక్షపతి, వంగల శివరాం, జలగం సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విప్లవ సంఘాలను ఆదరించాలి

గోదావరిఖని, డిసెంబర్ 18: కార్మికుల హక్కుల కోసం నిజాయితీగా పోరాడే విప్లవ సంఘాలను ఆదరించాలని ఏఐఎఫ్‌టీయూ గౌరవాధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. జీడీకే-11వ గనిపై మంగళవారం విప్లవ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్‌లో విశ్వనాథ్, దుర్గయ్యతో కలిసి మాట్లాడారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో శేఖర్, మాతంగి రాయమల్లు, యాకన్న, జగదీశ్, రామస్వామి పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం కల్పించాలని వినతి

పెద్దపల్లి, డిసెంబర్19: తెల్లరేషన్ కార్డున్న పురుషులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలు, పురుషులకు ఉచిత ప్రయాణాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉచిత ప్రయాణాలతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు. ఆటో డ్రైవర్‌కు ప్రతి నెలా రూ. 3వేలు అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ కనకం గణేశ్ , పెద్దపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి బచ్చలి ఆమని, జిల్లా ప్రచార కమిటీ సభ్యులు క్యాదాసి రమేశ్, ఏదుల శంకరయ్య, బచ్చలి రాజయ్య , కుక్క మనోజ్, క్యాదాసి రాజు, సందీప్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

గోదావరిఖని, డిసెంబర్ 19: సింగరేణి సేవా సమితి ఆర్జీ-1 ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వృత్తి శిక్షణ తరగతులను మంగళవారం ఆర్సీవోఏ క్లబ్‌లో జీఎం చింతల శ్రీనివాస్ ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏజీఎం లక్ష్మీనారాయణ, పీవో సారంగపాణి, కో-ఆర్డినేటర్ మేడి తిరుపతి, రవికుమార్, శిక్షకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే

జ్యోతినగర్, డిసెంబర్ 19: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి బయట పిల్లల వివరాల సేకరణకు మంగళవారం ఎన్టీపీసీలో సీఆర్‌పీలు సర్వే చేపట్టారు. పట్టణంలోని మల్కాపూర్, నర్రశాలపల్లి ఏరియాలో బడి మనేసి పనులకు వెళ్తున్న పిల్లల వివరాలను సేకరించారు. వచ్చే నెల 11వరకు చేపడుతున్న ఈ సర్వేలో బడి మానేసిన పిల్లల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని సీఆర్‌పీలు కోరారు. ఇక్కడ మల్కాపూర్ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, సీఆర్‌పీ రాంకుమార్ ఉన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి, డిసెంబర్19: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో పోస్ట్‌మెట్రిక్ (రెన్యువల్/ఫ్రెష్) స్కాలర్‌షిప్ కోసం ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులా అభివృద్ధి అధికారి నాగెలేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. http:// telanganaepass. cgg.gov.in ఈ పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆ పత్రాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యమందించాలి

- పారిశుధ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 19: పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో వైద్యారోగ్య , మున్సిపల్ శాఖల అధికారలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంతోపాటు గ్రామాల్లోని పల్లె, పట్టణాల్లోని బస్తీ దవాఖానల్లో వసతులు పెంచాలన్నారు. జిల్లా ప్రజలకు సరిపడేలా కొత్త దవాఖానలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలోని పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెత్తను ఎప్పటికప్పుడు తీసేయడంతోపాటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని కోరారు. ఇక్కడ వైద్యారోగ్య శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయాధికారి మందల వాసుదేవారెడ్డి, జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ రమాకాంత్, సుల్తానాబాద్ దవాఖాన సూపరిండెంట్ రమదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ -2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆవిష్కరించారు. రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు, పెద్దపల్లి జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడూరి వినోద్‌కుమార్ సారథ్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించారు. నాయకులు ఆంజనేయరావు, కలవేన మహేందర్, ఉప్పు రాజు, ఎరుకల రమేశ్, గుజ్జుల కుమార్, ఎలగందుల శంకరయ్య, లడ్డూ ఉన్నారు.

కొండగట్టులో ఎమ్మెల్యే పూజలు

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కుటుంబ సమ్మేతంగా మంగళవారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శాసన సభలో ప్రమాణ స్వీకారం తర్వాత మెదటిసారిగా ఆయన పెద్దపల్లికి వచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత కొండగట్టుకు వస్తానని ముడుపుకట్టిన ఎమ్మెల్యే మొక్కు తీర్చుకోవడానికి కొండగట్టుకు వెళ్లారు. పూజారులు, ప్రత్యేక పూజలు నిర్వహించి వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఓదెల, డిసెంబర్19: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. మంగళవారం మండల స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల షటిల్ క్రీడాకారులు పరిచయం చేసుకొని షటిల్ ఆడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సర్పంచ్ మూల ఉమామహేశ్వరి, ఉపసర్పంచ్ గోలి లింగారెడ్డి పాల్గొన్నారు.

పత్తి క్వింటాలు ధర రూ. 6621

పెద్దపల్లి, డిసెంబర్19: పెద్దపల్లి ఏఎంసీలో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. మంగళవారం 179 మంది రైతుల నుంచి 965 క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటాలుకు కనిష్ఠ ధర రూ. 5811, గరిష్ఠ ధర రూ. 6621, మోడల్ ధర రూ. 6531 లభించిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్ వెల్లడించారు.

బాక్సింగ్ పోటీల్లో కనగర్తి విద్యార్థుల ప్రతిభ

ఓదెల, డిసెంబర్ 19: కనగర్తి హైస్కూల్ విద్యార్థులు బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమేశ్, పీఈటీ విష్ణు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో కనగర్తి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పెండం శివ, పవన్‌కుమార్, ముద్దమల్ల అజయ్, లింగాల విశాంత్ పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు మహబూబ్‌బాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేస్తున్న అధికారులు

ధర్మారం,డిసెంబర్19: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో భీమ జయశీల మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మల్లారెడ్డి, ఆర్ఐ-1 వినోద్, ఎంపీవో రమేశ్, సర్పంచులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల బ్రోచర్ విడుదల

బ్రోచర్ విడుదల చేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 19 : జిల్లా కేంద్రంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో బీఎంఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించే రాష్ట్ర స్థాయి కరాటే పోటీల బ్రోచర్‌ను మంగళవారం కరస్పాండెంట్ శోభారాణి ఆవిష్కరించారు. ఈ పోటీల్లో అన్ని జిల్లాల నుంచి 300 క్రీడాకారులు పాల్గొననున్నట్లు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ కర్ర వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాణిశ్రీదేవి, పీఈటీలు రాజు, ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీలో క్రీడా వార్షికోత్సవం

జ్యోతినగర్, డిసెంబర్ 19: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని రామగుండం కేంద్రీయ విద్యాలయంలో క్రీడా వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. విద్యార్థులకు అథ్లెటిక్స్ తతర పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులు జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్ సీఐఎస్ఎఫ్ కమాడెంట్ యోగేశ్ పర్మార్, స్వప్నిల్ పర్మార్ విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మార్కండేయుల సూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రాష్టస్థాయి టేబుల్ టెన్నిస్‌లో ఐపీఎస్ విద్యార్థుల సత్తా

సుల్తానాబాద్, డిసెంబర్ 19: కరీంనగర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలు నిర్వహించారు. టెబుల్ టెన్నిస్‌లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఖుషి, పునీత, సంప్రీత్, సుశాంత్, అష్రాఫ్ ప్రతిభ చూపి, రాష్టస్థాయిలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, అభినందించారు. ఇక్కడ వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్ ,శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఇద్దరిపై దాడి : 8 మందిపై కేసు నమోదు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 19 : పెద్దపల్లి మండలం రాగినేడులో మంగళవారం పాత కక్షలను మనసులో పెట్టుకుని ఇద్దరిపై దాడి చేయగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాగినేడుకు చెందిన ఇల్లందుల పరశురాములు, అతడి తండ్రి ఇల్లందుల వీరయ్యపై అదే గ్రామానికి చెందిన నాగపురి కార్తీక్, వెంకటేశ్ తన కుటుంబసభ్యులు, అనుచరులతో కలిసి కర్రలతో దాడి చేశారు. పరశురాములు అయ్యప్పస్వామి పూజలో ఉండగా అతడిపై కూడా దాడి చేయగా అక్కడి నుంచి పారిపోయాడు. వీరయ్యను కర్రలతో కొట్టగా తీవ్ర గాయాలపాలయ్యాడు. వీరయ్యను కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాధితుడు ఇల్లందుల పరశురాములు ఫిర్యాదు మేరకు నాగపురి కార్తీక్, నాగపురి వెంకటేశ్, నాగపురి మల్లయ్య, నాగపురి సంపత్, నాగపురి అక్షయ్, నాగపురి అంజలి, నాగపురి కవిత, నాగపురి రమ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాగపురి వెంకటేశ్ తన కొడుకు చనిపోవడానికి ఇల్లందుల పరశురాములు కుటుంబసభ్యులే కారణమనే ఉద్దేశంతో దాడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొన్నారు.

సుల్తాన్‌పూర్‌లో తమిళ నాడు అధికార బృందం పర్యటన

ఎలిగేడు, డిసెంబర్ 19: గ్రామాభివృద్ధిపై జాతీయ స్థాయిలో ఎంపికైన సుల్తాన్‌పూర్‌ను మంగళవారం తమిళనాడు ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన అధికార బృందం సందర్శించింది. గ్రామంలో పర్యటిస్తూ అభివృద్ధి పనులపై సర్పంచ్ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. నర్సరీ, ప్లాంటేషన్, హెల్త్ సబ్ సెంటర్, స్కూల్, కిచెన్‌గార్డెన్, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి కోసం తీసుకున్న కార్యాచరణ ప్రణాళికలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారుల బృందాన్ని సర్పంచ్ సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఉషారాణి, డీఎల్పీవో వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్ రెడ్డి, ఏఈ డీటీఎం సురేందర్, ఎస్బీఎం కోఆర్డినేటర్ రాఘవులు, ఏపీవో, ఏపీఎం, ఐకేపీ సీసీ, టీఏ, వార్డు సభ్యులు ఏడబ్ల్యూటీ, హెల్త్ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఎఫ్ఏ, వీవోఏ, తమిళనాడులోని ఈరోడ్, సేలం, మధురై, చెన్నై, నమక్కల్ జిల్లాలకు చెందిన 35 మంది అధికారులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస రెడ్డి

శ్రీనివాసరెడ్డి

కోల్‌సిటీ, డిసెంబర్ 19: గోదావరిఖని శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ చైర్మన్‌గా పిన్నింటి శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జాతర కమిటీ సభ్యులు, సమ్మక్క, సారలమ్మ జాతర కార్యనిర్వహణ అధికారి సమక్షంలో సమావేశమయ్యారు. జాతర కమిటీ చైర్మన్‌గా గతంలో కొనసాగిన బంగారు రాజయ్య, మోహన్ రెడ్డి ఫిబ్రవరిలో జరిగే జాతరకు చైర్మన్‌గా శ్రీనివాస రెడ్డిని ప్రతిపాదించగా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. త్వరలోనే జాతర ఏర్పాట్లపై తీర్మానాలు చేయనున్నట్లు చైర్మన్ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 19: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి ఎస్ఐ అర్కుటి మహేందర్ సూచించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సైబర్ నేరాగాళ్లు చిన్న పాటి వెసులుబాటుతో బ్యాంక్ ఖాతాలో నగదు మాయం చేస్తారని, ఏటీఎం కార్డు ఇతరులకు ఇవ్వరాదని సూచించారు. సైబర్ క్రైం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే ఓటీపీ వస్తుందన్నారు. దీని ప్రకారం స్థానిక ఠాణాలో కేసు నమోదుచేస్తారని చెప్పారు.

అకౌంట్ నుంచి రూ.లక్ష మాయం

పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన కల్వల రాజేశం, కల్వల వసంత బ్యాంక్ అకౌంట్ నుంచి ఈ నెల 16,17,18 తేదీల్లో రూ. లక్ష నగదు మాయం అయినట్లు తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. రాజేశం అతడి భార్య వసంతకు పట్టణంలోని భూంనగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ ఉన్నది. వసంత అకౌంట్ నుంచి రూ. 45 వేలు, రాజేశం అకౌంట్ నుంచి రూ. 30 వేలు విత్‌డ్రా కాగా సైబర్ క్రైం 1930 కు ఫిర్యాదు చేసి, పెద్దపల్లి ఎస్ఐ మహేందర్‌కు సమాచారం ఇచ్చారు.

కేశోరాం కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

పాలకుర్తి, డిసెంబర్ 19: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టు కార్మికులు మంగళవారం జనరల్‌షిఫ్టులో విధులు బహిష్కరించి, కర్మాగారం ప్రధానద్వారం వద్ద ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మ య్య, ప్రధాన కార్యదర్శి కాల్వల అంజయ్య ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్ కర్మాగారానికి వచ్చి కార్మిక సంఘం నాయకులు, యాజమాన్యంతో చర్చలు జరిపినా కార్మికులు శాంతించలేదు. యాజమాన్యం తరపున ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ గోవిందరావు, యూనియన్ అధ్యక్షుడు సూర సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య, కార్మికులతో మాట్లాడి ఈ నెల 21న హైదరాబాద్‌లో గుర్తింపు కార్మికసంఘం ప్రతినిధులతో కలిసి చర్చిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు.

22లోగా రిజిస్టర్ చేసుకోవాలి

పెద్దపల్లి, డిసెంబర్19: యువజనోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఈ నెల 22లోగా తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 15 -29 ఏండ్ల యువ కళాకారులకు జానపద నృత్యం (గ్రూప్), జానపద గేయం గ్రూప్ ,సోలో విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్, ఫొటోగ్రఫీ, హస్తకళలు, టెక్స్‌టైల్స్, అగ్రిప్రొడక్ట్స్‌లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29న పెద్దపల్లి లోని అమర్ చంద్ కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు నిర్వహిస్తారని వెల్లడించారు. అసక్తి గల యువత ఎలాంటి రుసుము లేకుండా పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే తమ పేర్లను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయములో ఈ నెల 22 లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9440167222లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ధర్మశాస్త్రలో వైభవంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కోల్‌సిటీ, డిసెంబర్ 19: గోదావరిఖని తిలక్‌నగర్ ధర్మశాస్త్ర నిత్యాన్నదాన వేదిక 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కోరుకంటి చందర్ హాజరై అయ్యప్ప స్వామి పాటలు పాడుతూ ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు కౌటం బాబు, చల్ల రవీందర్ రెడ్డి, వడ్డెపల్లి శంకర్, జేవీ రాజు, అయ్యప్ప దీక్షాపరులు, స్థానికులు పాల్గొన్నారు.

కలుషిత జలాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 19: ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి విడుదలవుతున్న రసాయన నీటితో గోదావరి కలుషితమై ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని ఫైట్ ఫర్ బోటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఆరోపించారు. ఆర్ఎఫ్‌సీఎల్ రసాయనాలతో కూడిన నీటి విడుదల నిలిపివేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు.

ఆర్సీవోఏ క్లబ్ లో ఆయుర్వేద వైద్య శిబిరం

గోదావరిఖని, డిసెంబర్ 19: సింగరేణి ఆర్జీ-1 సేవా సమితి ఆధ్వర్యంలో మాతా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆర్సీవోఏ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఏజీఎం లక్ష్మీనారాయణ, సేవా కో-ఆర్డినేటింగ్ సారంగపాణి సందర్శించి మాట్లాడారు. చర్మ వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, థైరాయిడ్, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా తదితర వ్యాధుల నివారణ కోసం ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమా చెక్కు పంపిణీ

ధర్మారం,డిసెంబర్19: మల్లాపూర్ గ్రామానికి చెందిన ధర్ముల లక్ష్మి ధర్మారం స్టేట్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎం జేజేబీవై) కింద రూ. 436 చెల్లించి బీమా చేయించుకుంది. ఇటీవల లక్ష్మి మరణించడంతో ఆమె పేరిట రూ.2 లక్షల బీమా సొమ్ము వచ్చింది. మృతురాలి కూతురు కవిత నామినీగా ఉండడంతో ఆమెకు మంగళవారం ధర్మారంలోని బ్రాంచ్ మేనేజర్ కోరె రమేశ్‌తో కలిసి ఆర్ఎం అనుపమ్ ఆదర్శ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, బాలసాని శ్రీదర్, S/o కనకయ్య, Age: 43, Occ: Business, H.No. 4-38, గ్రా॥ కన్నాల, మం॥ పలకుర్తి, జిల్లా॥ పెద్దపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా కరీంనగర్, సబ్ జిల్లా మంథని, రెవెన్యూ మండలం/మండల పరిషత్ కమాన్‌పూర్ గ్రామ పంచాయతి కన్నాల గ్రామము రెవెన్యూ కన్నాల, కోడ్ నెం. 2008011, శివారులోని ఖాళీ నివేశన స్థలం సర్వే నెం. 640/1/A/A, విస్తీర్ణం 610.27 చ॥గజములు సరియగు 510.26 చ॥మీలు గల హద్దులు. లో కల ఈ హద్దులు.
తూర్పు : ముత్యాల తిరుపతి గారి ఖాళీ స్థలం
పడమర : 18 ఫీట్ల దారి
ఉత్తరం : పుప్పాల రాయమల్లు గారి ఖాళీ స్థలం
దక్షిణం : గండికోట సుధాకర్ గారి ఖాళీ స్థలం
కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాదీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.
ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి, కరీంనగర్. సెల్: 9849331558

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, MIRZA SHAFIULA BAIG, s/o SAZID BAIG occ: Business, H.No. 4-6-91, MOGHALPURA, PEDDAPALLI, All The part and parcel of open plot No. 11 in Sy.No. 1713/2/A, to an extent of 250.80 Sq. yards equal to 209.69 sq.meters (without word and Block) is Bounded By: saituted at PEDDAPALLI TOWN (code: 2016012) Municipality Peddapalli mandal Parishad Peddapalli Zilla parishad Peddapalli, within Registration District Karimnagar and Sub District Peddapalli లో కల ఈ హద్దులు.
తూర్పు : PLOT NO: 12 OF VENDOR
పడమర : PLOT NO: 10 OF FAHMEEDA QURESHI
ఉత్తరం : 21'-0' WIDE ROAD
దక్షిణం : 21'-0' WIDE ROAD
కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాదీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.
ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి, కరీంనగర్. సెల్: 9849331558